'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

ఫిరాయింపులతో రాజకీయ అస్థిరత

జమలాపురపు విఠల్‌రావు

> ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంత సహజమో.. విభిన్న రాజకీయ సిద్ధాంతాలు కలిగిన పార్టీలు ఉండటమూ అంతే సహజం. దేశాన్ని పాలించడానికి రాజకీయ పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండటం ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదని చెప్పడానికి నిదర్శనం. విభిన్న రాజకీయ సిద్ధాంతాలకు రాజకీయ పార్టీలు నిర్దిష్టమైన రూపాన్నిస్తాయి. అయితే ఫిరాయింపు అనేవి పార్టీ వ్యవస్థకు పట్టిన చీడపురుగు వంటిది. ఈ నేపథ్యంలో అమల్లో ఉన్న ఫిరాయింపు నిరోధక చట్టం.. కొన్ని పరిమిత పరిస్థితుల్లో మాత్రమే పార్లమెంట్, అసెంబ్లీల్లో రాజకీయ పార్టీలకు చెందిన చట్టసభ సభ్యులు, స్వతంత్ర లేదా నామినేటెడ్ సభ్యులపై అనర్హత వేటు పడకుండా పార్టీలు మారడానికి అనుమతిస్తుంది. సాధారణంగా ఒక సభ్యుడు తన మాతృపార్టీని వదిలిపెట్టి మరో పార్టీలో చేరే పరిస్థితినే 'ఫిరాయింపు' అని వ్యవహరిస్తారు. సంప్రదాయికంగా ఈ ఫిరాయింపును 'ఫ్లోర్ క్రాసింగ్' అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటగా బ్రిటిష్ దిగువ సభ (హౌజ్ ఆఫ్ కామన్స్) ప్రాచుర్యంలోకి తెచ్చింది.

మన దేశంలో పార్టీ ఫిరాయింపులు అతి మామూలు విషయంగా మారిపోవడమనేది ఎప్పటికప్పుడు రాజకీయ అస్థిరతకు దారి తీస్తున్నది. ఫలితంగా 'పరిపాలన'పై ఉంచాల్సిన దృష్టిని 'ప్రభుత్వం'పై కేంద్రీకరించాల్సిన దుస్థితి నెలకొంటున్నది. 1960 ప్రాంతంలో ఈ పార్టీ ఫిరాయింపులు అత్యధికంగా చోటుచేసుకున్న నేపథ్యంలో 'ఆయారాం.. గయారాం' అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. మన దేశంలో ఫిరాయింపుల చరిత్ర బ్రిటిష్ పాలనా కాలం నుంచే ప్రారంభమైంది. సెంట్రల్ లెజిస్లేచర్ సభ్యుడు శ్యాంలాల్ నెహ్రూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఫిరాయించి బ్రిటిష్ వారికి మద్దతివ్వడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఫిరాయింపునకు మరో ఉదంతం చెప్పుకోవాలంటే.. ముస్లిం లీగ్ పార్టీ నుంచి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికైన హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీం 1937లో కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. 1960 దాటిన తర్వాత దేశంలో సైద్ధాంతిక రాజకీయ నిబద్ధత స్థానంలో ఇతరత్రా అంశాలు చోటుచేసుకోవడం మొదలైంది. దేశంలో నాలుగవ సాధారణ ఎన్నికలు ముగిసిన తర్వాత ఏర్పాటైన చవాన్ కమిటీ 1969లో ఒక నివేదిక సమర్పించింది. దీని ప్రకారం మొదటి-నాలుగవ సాధారణ ఎన్నికల మధ్యకాలంలో అంటే రెండు దశాబ్దాలలో వివిధ రాష్ట్రాల్లో 542 ఫిరాయింపు కేసులు నమోదయ్యాయి. వీటిల్లో 438 ఫిరాయింపులు కేవలం 1967 మార్చి నుంచి 1968 ఫిబ్రవరి మధ్యకాలంలో జరిగినవేనని నివేదిక పేర్కొంది. ఆ సమయంలో 376 మంది స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికవగా.. వీరిలో 157 మంది వివిధ పార్టీల్లో చేరిపోయారు. పార్టీలు ఫిరాయించిన 210 మంది ఎమ్మెల్యేల్లో 116 మందికి మంత్రి పదవులు లభించాయంటే.. పదవీ వ్యామోహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిరాయింపు నిరోధక చట్టం దిశగా అడుగులు

1967 ఆగస్టు 11న నాలుగవ లోక్‌సభలో పి.వెంకటసుబ్బయ్య అనే సభ్యుడు ఫిరాయింపులను నిరోధించాలంటూ ఒక ప్రైవేటు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై అదే ఏడాది నవంబర్ 24, డిసెంబర్ 8వ తేదీన లోక్‌సభలో చర్చ జరిగింది. అనంతరం తీర్మానాన్ని లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులపై నాటి కేంద్ర హోంమంత్రి వైబీ చవాన్ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయగా.. 1969 ఫిబ్రవరిలో ఆ కమిటీ నివేదికను సమర్పించింది. ఫిరాయింపులను అదుపు చేయడానికి కమిటీ సూచనలు సరిపోవని భావించిన కేంద్ర సర్కార్.. 1973 మే 16న లోక్‌సభలో 32వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. రాజ్యాంగబద్ధంగా ఫిరాయింపులను నిరోధించాలన్నది ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. బిల్లును పార్లమెంట్ ఉభయసభల జాయింట్ కమిటీ పరిశీలనకు పంపారు. అయితే 1977 జనవరి 18న ఐదో లోక్‌సభ రద్దు కావడంతో ఈ కమిటీ మురిగిపోయింది. 1978 ఆగస్టు 28న 48వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో దీన్ని లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. అధికార, వివక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకోకతప్పలేదు.

ఫిరాయింపు నిరోధక చట్టం - 1985

1985 జనవరి 24న లోక్‌సభలో 52వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. దీని ప్రకారం రాజ్యాంగంలోని 101, 102, 190, 191 అధికరణాలను సవరించారు. దీంతో పాటు రాజ్యాంగంలో పదవ షెడ్యూల్‌ను చేర్చారు. ఫిరాయింపుల నేపథ్యంలో ఒక సభ్యుడు అనర్హతకు సంబంధించిన నిబంధనలను ఇందులో పొందుపరచారు. 1985 జనవరి 30, 31వ తేదీల్లో వరుసగా లోక్‌సభ, రాజ్యసభలు ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. ఈ చట్టం 1985 మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్, ఫిరాయింపునకు పాల్పడే లోక్‌సభ సభ్యుల అనర్హతకు సంబంధించిన నిబంధనలు రూపొందించారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ 8వ పేరాకు అనుగుణంగా రూపొందించిన ఈ నిబంధనలు 1986 మార్చి 18 నుంచి అమల్లోకి వచ్చాయి.

ఫిరాయింపు చట్టం (పదవ షెడ్యూల్)లోని ముఖ్యాంశాలు

నిబంధన-2: ఒక రాజకీయ పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యుడు స్వచ్ఛందంగా ఆ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నప్పుడు, పార్టీ ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేసినా లేదా తటస్థంగా ఉన్నా తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు. ఒకవేళ సభ్యుడు పార్టీ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నా లేక అతడు ఆ విధంగా వ్యవహరించిన తేదీ నుంచి పదిహేను రోజుల్లోగా పార్టీ అతడిని క్షమించినా సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడదు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన సభ్యుడు మరో పార్టీలో చేరితే లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు. ఒక నామినేటెడ్ సభ్యుడు ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే చట్టసభలో సభ్యత్వం పొందిన తేదీ నుంచి ఆరు నెలలకు తన సభ్యత్వాన్ని కోల్పోతాడు.

నిబంధన-3: రాజకీయ పార్టీలో చీలిక వచ్చి రెండు గ్రూపులు ఏర్పడినప్పుడు వారిపై అనర్హత వేటు పడదు. ఒక రాజకీయ పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 1/3వ వంతు ఫిరాయించినప్పుడు వారిని పార్టీ చీలిక గ్రూపుగా పరిగణిస్తారు. అయితే ఈ నిబంధనను 2003లో చేపట్టిన 91వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

నిబంధనలు-4, 5: ఒక పార్టీ వేరొక రాజకీయ పార్టీలో విలీనమైనప్పుడు సదరు పార్టీ సభ్యులకు అనర్హత వర్తించదు. వినీనం తర్వాత కొత్త పార్టీ ఆవిర్భవించవచ్చు లేదా వీరంతా విలీనం చేసుకున్న పార్టీ సభ్యులుగా పరిగణనలోకి వస్తారు. విలీనమైన పార్టీకి చెందిన సభ్యుల్లో కొంతమంది ఆ విలీనాన్ని అంగీకరించకపోతే, వారు ఒక ప్రత్యేక గ్రూపుగా కొనసాగుతారు. విలీనమయ్యే పార్టీకి చెందిన సభ్యుల్లో 2/3వ వంతుకు తగ్గకుండా సభ్యులు అంగీకరించినప్పుడు మాత్రమే ఆ విలీనం ఆమోదం పొందుతుంది.

నిబంధన-6: ఒక సభ్యుడిపై అనర్హత వేటు విధించే విషయంలో స్పీకర్ లేదా చైర్మన్‌దే తుది నిర్ణయం.

ఒక రాజకీయ పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యుడు స్వచ్ఛందంగా ఆ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నప్పుడు, పార్టీ ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేసినా లేదా తటస్థంగా ఉన్నా తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు. ఒకవేళ సభ్యుడు పార్టీ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నా లేక అతడు ఆ విధంగా వ్యవహరించిన తేదీ నుంచి పదిహేను రోజుల్లోగా పార్టీ అతడిని క్షమించినా సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడదు.

91వ రాజ్యాంగ సవరణ చట్టం

2003 మే 5న అప్పటి ప్రభుత్వం 97వ రాజ్యాంగ సవరణ చట్టం- 2003 పేరుతో లోక్‌సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టింది. స్టాండింగ్ కమిటీ ఆన్ హోం ఎఫైర్స్ పరిశీలనకు ఈ బిల్లును పంపగా.. ఆ కమిటీ కొన్ని సిఫారసులను చేసింది. వీటిని బిల్లులో చేర్చి 2003, డిసెంబర్ 16న లోక్‌సభ, 18న రాజ్యసభ ఆమోదం తెలిపాయి. 2004 జనవరి 1న రాష్ట్రపతి ఈ బిల్లును 91వ రాజ్యాంగ సవరణ బిల్లు-2003గా ఆమోదం తెలిపారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ చీలికకు సంబంధించిన నిబంధనలను ఈ చట్టం తొలగించింది.

పదవ షెడ్యూల్‌లోని రెండవ పేరాలో పేర్కొన్న విధంగా ఒక సభ్యుడు అనర్హతకు గురైతే.. అతడు మంత్రి పదవి లేదా మరే విధమైన రాజకీయ పదవిని పొందడానికి వీల్లేదని ఈ బిల్లు స్పష్టం చేసింది. సదరు సభ్యుడు అనర్హతకు గురైన తేదీ నుంచి గడువు ముగిసే వరకు లేదా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే వరకు ఈ అనర్హత వర్తిస్తుంది.

వివిధ దేశాల్లో ఫిరాయింపులు

బ్రెజిల్, ఇటలీ, రొమేనియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో పార్టీ ఫిరాయింపులు సర్వ సాధారణం. ఆస్ట్రేలియాలో 1916లో నేషనల్ లేబర్ పార్టీ చీలిపోయింది. 1931లో లాంగ్ లేబర్ పార్టీ, 1940 కమ్యూనిస్టేతర లేబర్ పార్టీ, 1955లో యాంటీ కమ్యూనిస్ట్ లేబర్ పార్టీల్లో చీలికలు వచ్చాయి. 2024 టాస్మేనియా రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసిన లిబరల్ పార్టీ ప్రీమియర్ జర్మీ రాక్లిఫ్ తమ పార్టీ అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపులను నిషేధిస్తూ రాష్ట్ర రాజ్యాంగంలో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ దేశాల్లో అత్యధిక పార్టీ ఫిరాయింపులు చోటుచేసుకునేది ఇటలీలో! 1996-2001 మధ్యకాలంలో ఇటాలియన్ ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ (దిగువసభ)లో 25 శాతం మంది సభ్యులు పార్టీలు ఫిరాయించారు. పార్టీ ఫిరాయింపులను మలేసియా తీవ్రంగా పరిగణిస్తుంది. ఈ మేరకు 2022లో రాజ్యాంగ సవరణ బిల్లు (నెం.3)ను దిగువ సభ దివాన్ రక్యాత్ 2/3 మెజారిటీతో ఆమోదించింది. న్యూజిలాండ్‌లో పార్టీ ఫిరాయింపును 'వాకా జంపింగ్' అని వ్యవహరిస్తారు. పార్టీ ఫిరాయింపుల నిరోధానికి ఎలక్టోరల్ (ఇంటిగ్రిటీ) అమెండ్‌మెంట్ యాక్ట్-2003 పేరుతో చట్టాన్ని తీసుకురాగా.. 2005 వరకు అది అమల్లో ఉంది. దీన్ని కొనసాగించే యత్నాలు 2005లో విఫలమయ్యాయి. చివరకు 2018లో ఈ చట్టాన్ని తిరిగి అమల్లోకి తెచ్చారు. రష్యన్ ఫెడరేషన్‌లో పార్టీ ఫిరాయింపులను చట్టవిరుద్ధంగా పరిగణిస్తారు. టర్కీలో పార్టీ ఫిరాయింపులు అసాధారణమేమీ కాదు. గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ (టర్కీ పార్లమెంట్)లో కుబులె యుగిన్ అనే సభ్యుడు (1995-99) ఒకే టర్మ్‌లో ఏకంగా ఏడు సార్లు తన పార్టీకి రాజీనామా చేశారు. అంతేకాదు, నాలుగు పార్టీలు మారి, చివరకు స్వతంత్ర సభ్యుడిగా తన టర్మ్‌ను ముగించాడు. ఉక్రెయిన్‌లో 'ఇంపరేటివ్ మ్యాండేట్' పేరుతో రాజ్యాంగ నిబంధన అమల్లో ఉంది. దీని ప్రకారం ఉక్రెయిన్ పార్లమెంట్ 'వర్కోవ్‌నా రాడా'కు ఎన్నికైన సభ్యులు తాము ఏ పార్టీ తరపున ఎన్నికయ్యారో ఆ పార్టీ సభ్యులుగానే కొనసాగాల్సి ఉంటుంది. అమెరికాలో పార్టీ ఫిరాయింపులు చాలా అరుదు. 1947-97 మధ్యకాలంలో 20 మంది మాత్రమే పార్టీలు మారారు. దక్షిణ పసిఫిక్ సముద్ర ప్రాంతానికి చెందిన దేశం 'వనౌటు'లో 2024 మే 29న మొట్టమొదటిసారి పార్టీ ఫిరాయింపులపై ఒక రాజ్యాంగ పరమైన ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) జరిపారు. 59.28 శాతం మంది ప్రజలు పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకిస్తూ ఓటు వేయడం విశేషం. దీని ప్రకారం ఒక పార్టీ తరపున ఎంపికైన పార్లమెంట్ సభ్యుడు, పార్టీ ఫిరాయిస్తే తన సీటు కోల్పోవాల్సి వస్తుంది.

> పై అంశాలను పరిశీలిస్తే ప్రజాస్వామ్య దేశాల్లో కొన్ని ఈ పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా పరిగణిస్తుంటే, మరికొన్ని దేశాలు దీన్ని ఒక పెద్ద సమస్యగా చూడకపోవడం కనిపిస్తున్నది. కానీ, పార్టీ ఫిరాయింపుల వల్ల వివిధ దేశాల్లో ప్రభుత్వాలు కుప్పకూలిపోయిన సంఘటనలు కోకొల్లలు. అంతేకాదు, వీటి వల్ల ఒక రాజకీయ పార్టీ లేదా సభ్యులు తమ విశ్వసనీయతను కోల్పోతారనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

తెలంగాణ అస్తిత్వానికే ముప్పు

> పాలకులెవరైనా తెలంగాణ ఆత్మగౌరవానికి క్షతి రాకూడదు. దశాబ్దాల పాటు అవమానాలపాలై తాడోపేడో తేల్చుకొనేలా కొట్లాడి, త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ పచ్చి అవకాశవాద రాజకీయ నేతల బారినపడి అస్తిత్వాన్ని కోల్పోకూడదు. స్వరాష్ట్రమంటే ఒక్క పాలనే కాదు, అడుగడుగునా తెలంగాణ భాష, సంస్కృతి, జీవన సరళి, జాతిగౌరవాలను నిలబెట్టుకోవడం. ఉమ్మడి పాలనలో తమ భాషను గేలి చేశారని ప్రజలు బాధపడ్డారు. బతుకమ్మను పట్టించుకోలేదని కలతచెందారు. ఇక సహించలేమని తెగించి, కొట్లాడి తెలంగాణను సాధించుకున్నారు.

బి.నర్సన్
94401 28169

స్వరాష్ట్రం సిద్ధించిన పదేండ్ల తర్వాత పాలనా పగ్గాలు కాంగ్రెస్ పార్టీ చేతిలోకి వెళ్లాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాల అమల్లో కొన్ని లోటుపాట్లు జరిగినందుకే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పరిశీలకుల ఉవాచ. అలవికాని హామీలను ఆశచూపి, జనాన్ని మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారనేది కేసీఆర్ మాట. ఎవరి మాట ఎలా ఉన్నా.. ప్రజల ఓట్లే పాలనను నిర్ణయిస్తాయి. అయితే పాలనతో పాటు తెలంగాణ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్నది. గత పదేండ్లలో తెలంగాణ కళలు, సాహిత్యం, సంస్కృతులకు తగిన ప్రాధాన్యం దక్కింది. ఈ విషయంలో కాంగ్రెస్ ఎంతో వెనుకబడి ఉంది. తెలంగాణ ప్రజలు ప్రాణప్రదంగా భావించే వీటి పట్ల ఆసక్తి, అవగాహన ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీలో లేరనే చెప్పాలి. అందుకే తెలంగాణ గీతం ప్రకటించినప్పటికీ.. దానికి సినిమా వాళ్లతో బాణీలు కట్టించడం వల్ల స్థానికత తగ్గి, శాస్త్రీయం పెరిగిందని విమర్శలు వచ్చాయి. 'నాకేం తెలియదు.. అందెశ్రీయే ఆయనను కావాలన్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి చేతులు దులిపేసుకున్నారు. రాజకీయ ఎత్తుగడే తప్ప 'గీతం ఎలా ఉంటే బాగుంటుంది' అనే శ్రద్ధ ఆయన మాటల్లో కనిపించలేదు. రాష్ట్ర చిహ్నం మార్పు అంశమూ వివాదాస్పదమైంది. కాకతీయ తోరణం, చార్మినార్‌లను తొలగించాలన్న ఆలోచన రసాభాసగా మారింది. చారిత్రక ఆనవాళ్లను రాచరిక చిహ్నాలంటూ సీఎం పేర్కొనడంపై పెద్ద చర్చే జరిగింది. తెలంగాణ తల్లి విగ్రహంలోనూ రేవంత్‌రెడ్డి వంకలు తీశారు. అయితే ప్రభుత్వం చేపట్టిన మార్పులు ఒక కొలిక్కి రాకపోవడంతో అది త్వరగానే సద్దుమణిగింది. నేలపై నిజమైన ప్రేమానురాగాలు, చారిత్రక పరిజ్ఞానం ఉంటే తప్ప చిహ్నాలు ఎలా ఉండాలో తీర్మానించుకోలేరు.

సంస్కృతిపరంగానే కాకుండా తెలంగాణ ఉనికిని, స్వరాష్ట్ర పరమార్థాన్ని కోల్పోయే ప్రమాదాలు కూడా ప్రస్తుత పాలనలో పొడచూపుతున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో సగం మందికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. పది మంది దాకా పార్టీ పాతకాపులు ఉండవచ్చు. అయితే క్రమంగా వారికి కూడా గౌరవం తగ్గుతున్నది. నిఖార్సయిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డికి ఏ మాత్రం సమాచారం లేకుండానే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లోకి రేవంత్ తీసుకోవడం ఆ పార్టీ సీనియర్లను విస్మయానికి గురిచేసింది. రేవంత్‌రెడ్డి వల్ల తమ ఉనికికే ప్రమాదం రావచ్చని వారు ఇప్పుడు బెదిరిపోతున్నారు. 70 ఏండ్ల దాటి, ఎన్నికల్లో ఓడిపోయిన వారిని తమ వెంట ఉంచుకోవడం దండుగ అనే ఆలోచన రేవంత్‌కు ఉండొచ్చు. పేరుకు కాంగ్రెస్‌లోనే ఉన్నా.. అసెంబ్లీలో అందరూ తనవాళ్లు ఉండాలనే ప్రణాళికతో ఆయన ముందుకెళ్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. రేవంతే పార్టీ చీఫ్ కూడా అయినందున ఆయనకు ఎదురే లేకుండాపోయింది. రేవంత్ మాట కాదని మరో సీనియర్‌కు పార్టీ చీఫ్ పదవి ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నది. కొత్త చీఫ్, సీఎం మధ్య పొసగకపోతే రాష్ట్రంలో తమ పార్టీ పాలనకే గండం రావచ్చని అధిష్ఠానం పెద్దల భయం. తెగేదాకా లాగితే పార్టీని సీనియర్లకు వదిలేసి.. తనతో వచ్చే ఎమ్మెల్యేలను వెంటేసుకొని రేవంత్ సొంత ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశమూ ఉంది. అదే జరిగితే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యేలందరూ ఆయనకు విధేయులుగా ఉంటారు. అందుకే సొంత బలం పెంచుకొనే దిశగా ఆయన అడుగులు పడుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి నెరవేర్చడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అసాధ్యమే. ఈ విషయాన్ని గ్రహించిన జనం లోక్‌సభ ఎన్నికల్లో ఆయన వెంట నిలువలేదు. ఆరు నెలల కాలంలోనే ఫలితాలు తారుమారయ్యాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న చోట్ల కూడా బీజేపీ జెండా ఎగిరింది. కాంగ్రెస్‌కు సమానంగా కమలం పార్టీ కూడా 8 లోక్‌సభ స్థానాలను గెలిచింది. అంటే దానర్థం.. సగం రాష్ట్రం కమలం పార్టీకి జై కొట్టినట్టే. అదీకాకుండా బీజేపీ తరపున గెలిచిన ఎంపీలు బలమైన నేతలు. రాష్ట్రంలో తమ పార్టీని బలోపేతం చేయడానికి వారు పూనుకుంటారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి, అమాత్యులు కావాలని వారు కలలు కంటారు. అదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కోవడం ద్వారా వచ్చే టర్మ్ కూడా తానే సీఎం అయ్యేలా రేవంత్ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వస్తే.. బీజేపీతో చేతులు కలిపి తన పదవిని పదిలం చేసుకునే అవకాశాన్ని ఆయన సృష్టించుకుంటున్నారు.

> **ఈ రాజకీయ గందరగోళంలో తెలంగాణ ఎటుగాని స్థితిలోకి జారుతున్నది. ఉద్యమంలో పాల్గొనని ప్రస్తుత పాలకులు, ఉత్తరాది పెత్తనాన్ని ఎదిరించలేని బీజేపీ నేతల మధ్య తెలంగాణ తన ఆత్మగౌరవాన్ని కోల్పోయే ప్రమాదం ముంగిట నిలిచి ఉన్నది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అంటే చంద్రబాబు.. చంద్రబాబు అంటే నరేంద్ర మోదీ. ఈ వాస్తవాన్ని బహిరంగంగా ప్రకటించేందుకు రేవంత్ వెనుకాడటం లేదు.**

'నేను, చంద్రబాబు, నరేంద్ర మోదీ సర్కారు బడిలోనే చదువుకున్నాం' అని ఇటీవల రేవంత్ గొప్పగా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తెలంగాణ నాయకుడు రేవంత్‌కు కానరాలేదా? బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో మాట్లాడుతూ.. 'చంద్రబాబు ఆదర్శనేత. కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల నేను, చంద్రబాబు విడిగా ఉండక తప్పడం లేదు' అని రేవంత్ చెప్పారు. ఈ మాటలన్నీ వింటుంటే.. 'ఎవరి పాలయిందిరా తెలంగాణ' అని అనిపించకపోదు. తెలంగాణ చరిత్ర, అస్తిత్వం, ప్రజల ఆత్మగౌరవం పట్ల పాలకులకు స్పృహ ఉండాలి. లేదంటే వారు ఈ నేలపై పుట్టినా పరాయివాళ్ల కిందే లెక్క. అందుకే కష్టపడి సాధించుకున్న తెలంగాణ తాకట్టుపాలు కాకుండా ప్రజలు గమనిస్తూ ఉండాలి. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి.

ప్రజలు కోపంతో ఉన్నారు!

> మణిపూర్ అల్లర్లను అదుపు చేయడంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు కారణంగా ప్రజలు నాపై కోపంతో ఉన్నారని తెలుసు. అది నేను అంగీకరిస్తా. పరిస్థితి సంక్లిష్టంగానే ఉన్నది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా కొనసాగాలా? పదవికి రాజీనామా చేయాలా? అనేది నా చేతుల్లో లేదు. **- బీరేన్‌సింగ్,** మణిపూర్ ముఖ్యమంత్రి

> నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) చుట్టూ ముసురుకున్న వివాదం మన దేశంలో డాక్టర్ కావాలని కలలుగనే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్లో ఒక భాగం మాత్రమే. అత్యంత విలువైన వైద్య సీటు పొందడం దగ్గర నుంచి వారు వైద్య విద్యను పూర్తిచేసేంత వరకు ఎదుర్కొనే ఆర్థికపరమైన సవాళ్ల గురించి చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం.

కోట్లుంటేనే తెల్ల కోటు!

సోనాలి

భారత్‌లో వైద్యుడు-జనాభా నిష్పత్తి 0.9:1000గా ఉన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలు 1:1000కు ఇది దగ్గరగా ఉన్నది. అయినప్పటికీ భారత్‌లో డాక్టర్ కావాలనుకునేవారి ప్రయాణం అడ్డంకులతో కూడుకున్నదే. దేశంలో లక్షకు పైగా వైద్య విద్య (ఎంబీబీఎస్) సీట్లు ఉండగా.. వాటి కోసం ఏటా లక్షల మంది పోటీ పడుతుంటారు. అదీకాకుండా మొత్తం సీట్లలో ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లు సగమే కావడం గమనార్హం. అయితే వీటిలోనూ చాలా సీట్లను వివిధ కోటాల రూపంలో కేటాయిస్తారు. దీంతో అర్హత ఉన్న అనేకమంది విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారు.

ఈ క్రమంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆర్థిక పరమైన అంశం ఎంతో భయానకంగా ఉంటుంది. దేశంలోని అనేక ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మొత్తం కోర్సు ఫీజు రూ.కోటి వరకు ఉంటుంది. ఈ అంశం పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల వైపు కన్నెత్తి చూసే అవకాశం లేకుండా చేస్తున్నది.

> **నీట్ విషయంలో రాజుకున్న కొత్త వివాదం జాతీయ అర్హత పరీక్షల నిర్వహణ పట్ల అధికారుల సామర్థ్యాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు విలువైన సమయం, ఇతర వనరులను కేటాయించిన లక్షల మంది విద్యార్థులపై ఈ వివాదం తీవ్ర ప్రభావం చూపుతున్నది.**

భారత్‌లో తెల్ల కోటు, స్టెతస్కోప్‌ను వేసుకోవాలనే కల ఎంతో ఖర్చుతో కూడుకున్నది. డాక్టర్ కావాలనుకునేవారికి అంకితభావం మాత్రమే ఉంటే సరిపోదు, గణనీయమైన ఆర్థిక పెట్టుబడులు కూడా అవసరం. ఈ ప్రయాణం కోచింగ్ ఖర్చులతో ప్రారంభమవుతుంది. ఆకాశ్, అలెన్, విద్యామందిర్.. ఇలా ఇన్‌స్టిట్యూట్‌ను బట్టి కోచింగ్ ఫీజు రూ.1.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. ప్రాంతం, ఇన్‌స్టిట్యూట్ ఎంపిక, అక్కడి వసతులు, బోధన సిబ్బంది నైపుణ్యం తదితర అంశాలు కోచింగ్ ఫీజును ప్రభావితం చేస్తాయి.

భారత్‌లో మొత్తం 600కు పైగా వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ కోర్సును అందిస్తున్నాయి. అయినప్పటికీ వైద్య విద్యకు పోటీ తీవ్రంగానే ఉన్నది. 2024లో నీట్-యూజీ పరీక్షకు 23 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అత్యధికులు తక్కువగా ఉండే ప్రభుత్వ మెడికల్ సీట్లపైనే గురిపెట్టారు. ఫీజుల్లో రాయితీలిచ్చే ప్రభుత్వ కళాశాలలు దేశవ్యాప్తంగా 386 మాత్రమే ఉండగా.. వాటిలో 55,095 సీట్లు మాత్రమే ఉన్నాయి. అంటే ఈ లెక్కన ఒక్కో సీటు కోసం సుమారుగా 42 మంది పోటీ పడుతున్నారు. అయితే దేశంలోని మొత్తం 320 ప్రైవేట్ కళాశాలల్లో 53,625 సీట్లున్నాయి. కానీ, వాటిలో ఉండే అధిక ఫీజుల కారణంగా అవి చాలామందికి అందుబాటులో లేకుండాపోతున్నాయి.

ప్రభుత్వ కళాశాలలు చాలా తక్కువగా ఏడాదికి రూ.5 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఫీజులను వసూలు చేస్తాయి. వసతులు, పేరుప్రఖ్యాతులను బట్టి ప్రైవేట్ కళాశాలలు ఏ